

ఇగ్నోలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వివిధ దూర విద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన జారీ చేసినదని ఇగ్నో కోఆర్డినేటర్ కెఎస్‌హెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్లో ఉన్న అడ్మిషన్ లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని, అన్ని కోర్సుల్లో ప్రవేశాలకు గడువు ఈ నెల 31వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. వివిధ దూర విద్యా కోర్సులతోపాటు ఐదు రకాల ఎంబిఎ డిగ్రీలను ఇగ్నో అందిస్తుందని, సాధారణ బిఎతోపాటుపాటు ఎంబిఎ (హెచ్ఆర్), ఎంబిఎ (మార్కెటింగ్), ఎంబిఎ (ఫైనాన్స్), ఎంబిఎ (ఆపరేషన్స్) అనే ఈ ఐదు రకాల ఎంబిఎలకు ఎఐసిటిఇ గుర్తింపు ఉందని తెలిపారు. ఈ ఐదు రకాల ఎంబిఎల్లో ప్రవేశానికి ఎటువంటి ప్రవేశ పరీక్ష అవసరం లేదని, వివరాలకు సిఆర్ రెడ్డి కళాశాల క్యాంపస్‌లోని ఇగ్నో సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రసవానికి పైసలివ్వాల్సిందే..!

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఓవైపు చెబుతుంటే దీనికి భిన్నమైన పరిస్థితులు కొన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కన్పిస్తున్నాయి. వాటిలో ఒకటిగా నరసాపురం ఏరియా ఆస్పత్రి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తాడేపల్లిగూడెంలో నిండు గర్భిణీ పట్ల వైద్య సిబ్బంది ప్రవర్తించిన తీరు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అదే విధంగా నరసాపురం ఏరియా ఆసుపత్రిలో కొందరు ఉద్యోగుల తీరు అభ్యంతరకరంగా ఉంటోందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.



నరసాపురం ఏరియా ఆసుపత్రి

కౌన్సెలింగ్ పేరిట గంటల తరబడి నిరీక్షణ
గతంలోనూ సదరు ఉద్యోగిపై ఫిర్యాదులు
గర్భిణులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - నరసాపురం

గర్భిణులు అంటే సామాన్యులు సైతం మానవతాదృక్పథంతో వ్యవహరిస్తారు. అయితే నరసాపురం ఏరియా ఆసుపత్రికి వచ్చిన సిబ్బంది పట్ల కౌన్సెలింగ్ పేరిట సిబ్బంది గంటల తరబడి వేచిచూసేలా జాప్యం చేస్తూ నిర్దయగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో గర్భిణులతోపాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021లో ఈ ఆసుపత్రిని నూతన భవనంలో ప్రారంభించారు. ప్రతిరోజూ ఈ ఆసుపత్రికి సుమారు 400 నుంచి 500 మంది వరకూ రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ 80 మందికిపైగా గర్భిణులు నెలవారీ పరీక్షల నిమిత్తం వస్తుంటారు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో గర్భిణులకు వైద్యులు సేవలందిస్తారు. ప్రతిరోజూ 300 నుంచి 350 మంది రక్త పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వస్తుంటారు. వీరికి రెండు విభాగాల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తారు. నరసాపురం తీర ప్రాంతాల నుంచి కాకుండా కృష్ణా జిల్లా బంటుమిల్లి, కృతివెన్ను, కోనసీమ జిల్లా మల్కీపురం, రాజోలు, సఖినేటిపల్లి నుండి సైతం వైద్య సేవల నిమిత్తం ఈ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 23 మంది వైద్యులు ఉండగా 20 మంది అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ వైద్య సేవలు నిరంతరాయంగా అందించాలంటూ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికల నోటీసులు సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్కరే గైనకాలజిస్టు ఉండటంతో ఆమెపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది.

అయితే కొందరు దిగువస్థాయి ఉద్యోగుల వల్ల ప్రభుత్వాసుపత్రికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగితే సంబంధిత బాలింత బంధువుల నుంచి కొందరు ఉద్యోగులు డబ్బు వసూలు చేస్తున్నారు. ఈ నెల 21న నరసాపురం పట్టణంలోని 17వ వార్డుకు చెందిన మహిళ ప్రసవానికి వెళ్లగా వారి వద్ద నుంచి రూ.4 వేలు డిమాండ్ చేయగా రూ.రెండు వేలు సమర్పించుకోవాల్సి వచ్చిందని సమాచారం.



ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న బాలింతలు

అదే సమయంలో కౌన్సెలింగ్ పేరుతో గర్భిణులు, టిబి రోగులను ఎక్కువసేపు నిరీక్షించేలా చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో రోగి, అతని బంధువులు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. కొంత స్థోమత ఉన్నవారు ఈ పడిగాపులు, అవస్థలు ఎందుకని ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొన్ని సమయాల్లో సదరు ఉద్యోగి తీరు కూడా అభ్యంతరకరంగా ఉంటోందని గర్భిణులు వాపోతున్నారు. కౌన్సెలింగ్ పేరుతో సదరు పురుష ఉద్యోగి గర్భిణిని ఒక్కరినే రూమ్‌లోకి అనుమతించి, వెంట బంధువులను గానీ, ఆశా కార్యకర్తలను గానీ రానీయకపోవడం, విచిత్రమైన, ఇబ్బందికర ప్రశ్నలు వేస్తున్నారని పలువురు గర్భిణులు వాపోతున్నారు. ఈ విధంగా ఒక్కో గర్భిణిని సుమారు 15 నిమిషాల నుంచి 20 నిమిషాల పాటు ఒంటరిగా కౌన్సెలింగ్ పేరిట పురుష ఉద్యోగి వ్యవహరిస్తున్న తీరుపై పలువురు అభ్యంతరం తెలిపినా, చివరకు పైఅధికారులు హెచ్చరించినా మార్పుకోవడం లేదని ప్రచారం సాగుతోంది. సదరు ఉద్యోగి ఇదే ఆసుపత్రిలో చాలాకాలంగా తిష్టవేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగిపై గతంలో పలువురు ఆశా కార్యకర్తలు, హెల్త్ సిబ్బందిసైతం వైద్యులకు ఫిర్యాదు సైతం చేశారు. అయినా అతని తీరు మారలేదని అటు సిబ్బంది, ఇటు గర్భిణులు వాపోతున్నారు. కౌన్సెలింగ్ పేరుతో సమయం వృథా చేయడం వల్ల రోగులు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులను ఒంటరిగా కౌన్సెలింగ్ పేరిట ఎక్కువ మందికి టెస్టులు చేస్తే తనకు గుర్తింపు వస్తుందనే స్వలాభాపేక్షతో రోగులతోపాటు వచ్చే బంధువులను సైతం రిజిస్టర్లో పేర్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఒక్కసారి బుక్‌లో, మరోసారి కంప్యూటర్లో పేర్లు నమోదు చేస్తూ సమయాన్ని ఈ ఉద్యోగి సమయాన్ని వృథా చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఈ నెల 23న నరసాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణీ ఉదయం ఆస్పత్రికి రాగా ఓపి రాయించుకుని కౌన్సెలింగ్‌కు వెళ్లగా సుమారు రెండు గంటల సమయం పట్టింది. అనంతరం రక్త పరీక్షకు రాగా బ్లడ్ శాంపిల్ తీసుకోవడానికి సమయం మధ్యాహ్నం రెండు గంటలైంది. పరీక్ష అనంతరం రిపోర్టులు చూసుకుని డాక్టర్ వద్దకు వెళ్లగా డాక్టర్ అందుబాటులో లేరు అని వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో గర్భిణీ మధ్యాహ్నం భోజనం చేయకుండా డాక్టర్ వచ్చే వరకూ వేచిచూడాల్సి వచ్చింది. ఈ పరిస్థితికి సదరు ఉద్యోగి నిర్వాకమే కారణమని తెలుస్తోంది. సదరు ఉద్యోగిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, గర్భిణులు కోరుకుంటున్నారు. టిబి పేషెంట్లను సైతం ఇదే రీతిన ఇబ్బంది పెడుతున్నారని చెబుతున్నారు. దీంతో వారు పరీక్షలకు సైతం ఆసుపత్రిలోకి అడుగు పెట్టేందుకు వెనుకాడుతున్నారు. ఇదే ఆసుపత్రిలో టిబి విభాగంలో పని చేస్తున్న ఉద్యోగి నెలకు కనీసం ఐదుగురు టిబి పేషెంట్లను తీసుకురావాలని ఆశా కార్యకర్తలకు హుకుం జారీ చేస్తున్నారు. లేకుంటే ప్రతినెలా ఆశా డే రోజున ఆశాలను అందరి ముందు తిడుతున్నారు. దీంతో ఆశా కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కోరుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

ఆర్.సుప్రియ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, నరసాపురం



ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలూ ఉచితం. అన్ని రకాల పరీక్షలూ వైద్య సేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఎవరైనా పేషంట్లు, బంధువుల వద్ద డబ్బులు వసూలు చేస్తే నేరుగా నాకు ఫిర్యాదు చేయండి. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఎవరైనా పేషెంట్లను వేధించినా, సేవల్లో ఏమైనా లోపాలుగాని, అవినీతిగాని ఎదురైతే నాకు ఫిర్యాదు చేయండి. అటువంటి వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.



ఏలూరులో డిఇఒ కార్యాలయం వద్ద నినదిస్తున్న వర్కర్లు

బకాయి వేతనాలు చెల్లించాలి

స్కూల్ శానిటేషన్ వర్కర్ల ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ (ఆయాలు) స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1900 మంది స్కూల్ శానిటేషన్ వర్కర్స్ పని చేస్తున్నారని, వారికి మూడు నెలలుగా జీతాలు లేవని, దీంతో వారు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని స్కూలు ఆయాలకు దాదాపు రూ.మూడున్నర కోట్లు మేర బకాయి జీతాలు రావాల్సి ఉందరన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి స్కూలు శానిటేషన్ వర్కర్లకు రావాల్సిన మూడు నెలల బకాయి జీతాలు వెంటనే ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చేనెల నాలుగో తేదీ నుండి స్కూల్ శానిటేషన్ పనులు బంద్ చేసి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. దానికి ప్రభుత్వం, అధికారులదే బాధ్యతని తెలిపారు. స్కూల్ శానిటేషన్ వర్కర్లకు ఇచ్చే నెలకు రూ.ఆరు వేల అరకొర వేతనాలు కూడా గత మూడు మాసాలుగా చెల్లించకపోవడంతో స్కూలు ఆయాలు ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు కట్టుకోలేకపోతున్నారని, పచారి సరుకులు కొనుక్కోలేక పోతున్నారని, పిల్లల ఫీజు కట్టుకోలేకపోతున్నారని తెలిపారు. పాఠశాలల పరిశుభ్రత కోసం పాటుపడుతున్న స్కూలు ఆయాల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి నశించాలని కోరారు. అనంతరం అడిషనల్ డిఇఒ అవధానికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు పి.దుర్గ, నాయకులు పూజిత, గౌసియా, సాబీర, ఉషారాణి, భవాని, సరస్వతి, బాలాజీ, ఝాన్సీరాణి, జమీల తదితరులు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నగర కార్యదర్శి జె.గోపీ సంఘీభావం తెలిపారు.



బుట్టాయగూడెంలో..



ఉంగుటూరులో..



ముదినేపల్లిలో..

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్, స్వీపర్లు, నైట్ వాచ్‌మెన్, ఆయాలకు మూడు నెలల నుంచి జీతాల బకాయిలను వెంటనే ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కెవి.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉంగుటూరులో ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల ఆర్గనైజర్ జివి.కృష్ణారావు, నాయకులు లింగంపల్లి సత్యవతి, అనంతలక్ష్మి, కె.పద్మ, పుష్ప, కవిత, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఎపి ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎడి షరీఫ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ వేతనల బకాయిలపై సెప్టెంబర్ రెండో తేదీన ప్రభుత్వం జిఒ నెం.413 విడుదల చేసిందని, ఇప్పటికీ వేతనాలు మాత్రం ఆయాలకు అందలేదని తెలిపారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పునః పరిశీలించాలన్నారు. విద్యార్థులు ఎక్కువ మంది ఉండటం వల్ల పని భారం పెరిగిందన్నారు. 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని చెప్పారు. వీరికి కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, రత్నకుమారి, నాగమణి, మంగ, సంధ్య, సోమాలమ్మ, రామలక్ష్మి, గంగాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్లకు పెండింగ్లో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద వర్కర్లు నిరసన తెలిపారు. అనంతరం ఆర్ఐ శామ్యూల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతల విజయలక్ష్మి, పి.వెంకటపద్మ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

ఏలూరులో మూడు ప్రాంతాల్లో తనిఖీలు
రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి
ప్రమాద స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు పెట్టాలి
జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేనిపక్షంలో శిక్షార్హులవుతారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించని కారణంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని, ఇది ఎవరినీ బెదిరించేది కాదని అన్నారు. వారి సురక్షిత ప్రయాణానికి రక్షణా చర్యలేనని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం మూలంగా రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణం రక్షించుకోవడమే కాకుండా వారి కుటుంబాలను నిలబెట్టినవారవుతారన్నారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులపై మోటార్ వెహికల్ చట్టం నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఏలూరులో శనివారం వట్లూరు, ఫైర్‌స్టేషన్ సెంటర్, సిఆర్.రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహనచోదకులపై నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధించడం, హెల్మెట్ అందించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో తాను, జిల్లా ఎస్‌పి కూడా పాల్గొంటామన్నారు. వాహనం కొనుగోలు చేసే సమయంలో నిబంధనల ప్రకారం తప్పనిసరిగా హెల్మెట్ కూడా వాహనదారునిచే కొనుగోలు చేయించాలని, ఈ విషయంపై జిల్లాలోని సంబంధిత ద్విచక్రవాహన షోరూముల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఐఎస్ నాణ్యత గల హెల్మెట్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలను అధ్యయనం చేసి నివారణా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మరణాలు సంభవించకుండా అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు, క్యాట్ ఐస్ ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల వర్షాల వల్ల గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. జాతీయ రహదారులపై గుంతలు ఏర్పడినప్పుడు యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతులు చేయాలన్నారు. జాతీయ రహదారిపై నిషిద్ధ ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేయకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని, ఇదే సమయంలో అటువంటి చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 33 బ్లాక్‌స్పాట్స్‌లో తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, రవాణా, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ ప్రమాదాలకు సంబంధించి మరణించిన వారికి రూ.రెండు లక్షలకు, గాయపడిన వారికి రూ.50 వేలకు పరిహారం పెంచామన్నారు. దీనికి సంబంధించి తక్షణమే క్లెయిమ్‌లు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సదుపాయం అందించడం, వారి ప్రాణాలను కాపాడే వారికి గుర్తింపుతోపాటు ప్రోత్సాహ బహుమతులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అని వైద్యులు చెబుతారని, ఆ సమయంలో బాధితులను ఆసుపత్రికి తరలించి రక్షించేందుకు ప్రయత్నించే వారిని గుడ్ సమారిటన్ కింద సత్కరిస్తారని చెప్పారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రహదారి భద్రత అందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు. జిల్లాలోని ఎన్‌హెచ్‌కి సంబంధించి ఎనిమిది పెట్రోలింగ్ వాహనాలు ఉన్నాయని, వారూ పోలీస్, రవాణా శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలన్నీ కలిసికట్టుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలతోపాటు ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు తు.చ తప్పక పాటిస్తే ప్రమాదాలు నివారించడంతోపాటు కొన్ని ప్రాణాలను కాపాడుకోగలుతామన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఉప రవాణా కమిషనర్ కెఎస్‌ఎంవి.కృష్ణంరాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, డిఇఒ ఎస్.అబ్రహాం, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, పలువురు పంచాయతీరాజ్, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దీపావళి దుకాణాల ఏర్పాటుకు నిబంధనలు తప్పనిసరి

దీపావళి పండుగ రోజున ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి బాణాసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనలు అంశాలపై సంబంధిత అధికారులు, జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో దీపావళి నిర్వహించుకునేలా సంబంధిత శాఖలు మంచి సమన్వయంతో పని చేయాలన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. దీనికోసం మాక్‌డ్రిల్ నిర్వహించాలని సూచించారు. బాణాసంచా వినియోగం, వాటివల్ల సంభవించే ప్రమాదాలపై జిల్లాలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. బాణాసంచా కాల్చేటప్పుడు ప్రమాదాలకు గురైన వారికి తక్షణ వైద్య సహాయం అందించేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మిగిలిన సంబంధిత వైద్యులను, మందులను అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్ఒను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా మందుగుండు సామాగ్రి తయారుచేసినా, నిల్వచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సూర్య ఘర్ యోజన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

వచ్చే సమావేశంలోగా సమస్యలు పరిష్కరించాలి

ఎంపిపి కె.రామయ్య

ప్రజాశక్తి - భీమడోలు

సభ్యులు, సర్పంచులు లేవనెత్తిన సమస్యలను వచ్చే సమావేశంలోగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని భీమడోలు ఎంపిపి కనుమాల రామయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఎంపిడిఒ పద్మావతిదేవి ఆధ్వర్యంలో సాగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానిరంగా హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ భాగస్వామ్యంతో సిద్ధం చేసిన అఖిల భారత పశు గణన వాల్‌పోస్టర్‌ను, విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ రామస్వామి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపిడిఒ పద్మావతిదేవి మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల్లో రక్షిత నీటి సరఫరా పథకం కింద వివిధ పనులకు ఎంఎల్ఎ ధర్మరాజు రూ.9.50 లక్షలు కేటాయించారన్నారు. తహశీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రభుత్వం గ్రామ సదస్సులను నిర్వహించనుందన్నారు. ఎంపిటిసిలు ముళ్లగిరి జాన్సన్, షేక్ ఆజాం, జి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు తగు రీతిలో సమాధానాలిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇంకా పూర్తి చేయని 1685 మంది లబ్ధిదారులు వచ్చే మార్చిలోపు పనులు పూర్తి చేయకుంటే వారికి బిల్లులు వచ్చే అవకాశం ఉండదని హౌసింగ్ ఎఇ చైతన్య తెలిపారు. వివిధ సమస్యలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఎంపిపి కనమాల రామయ్య మాట్లాడుతూ మండల పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహించినప్పుడు ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. సమావేశాలకు రాని అధికారులకు నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతు సలహా మండలి ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో అంబేద్కర్ గురుకులంలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - ఏలూరు

ద్వారకాతిరుమలలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో ఈ నెల 28, 29 తేదీల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు గురుకులం ప్రిన్సిపల్ బి.రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ద్వారకాతిరుమలలోని ఈ సైన్స్ ఫెయిర్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోల శ్రీబాలా వీరాంజనేయస్వామి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లాకు చెందిన ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని రాణి తెలిపారు.

నేడు త్రిపుర గవర్నర్ రాక

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఈ నెల 26న ఉంగుటూరు మండలంలో పర్యటిస్తా రని ఎంఎల్ఎ ధర్మరాజు చెప్పారు. తొలుత నారాయణపురంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఇంటికి రానున్నారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు గోపీనాథపట్నంలో శ్రీలక్ష్మీనారాయణ ఛారిటబుల్ ట్రస్టు విశ్రాంత భవనం వద్ద డ్వాక్రా మహిళలు, ఆక్వా రైతులతో సమావేశంలో పాల్గొంటారు. ఆక్వా రంగంలో సాధిస్తున్న ప్రగతి, లోటుపాట్లపై రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. ఫిషరీస్ అధికారులు ఆక్వా ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించామని సర్పంచి విష్ణుమూర్తి చెప్పారు.

అల్లు శ్రీనుకు రాష్ట్రస్థాయి అవార్డు


అల్లు శ్రీను

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఉపాధ్యాయులు అల్లు శ్రీనివాసరావుకు మదర్ థెరిస్సా స్టేట్ అవార్డు 2024 సంవత్సరానికి ఎంపికయ్యారు. అల్లు శ్రీనివాసరావుకు 2023 సంవత్సరంలో బెస్ట్ సోషల్ వర్కర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు తీసుకున్నందుకు మదర్ థెరిస్సా అవార్డు ఎంపిక చేశామని మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైజాగ్ ఫౌండర్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు ఇ.కృష్ణమూర్తి తెలిపారు. అల్లు శ్రీనుకు మెడల్, మెమెంటో, సర్టిఫికెట్, సన్మాన పత్రం బహూకరించారు. వీటిని పోస్టల్ ద్వారా పంపించారని అల్లు శ్రీనివాసరావు తెలిపారు. మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపిక చేసినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. అల్లు శ్రీనివాసరావును ఎంఇఒలు నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఎవిఎస్ఎన్.భాస్కర్‌కుమార్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

యుటిఎఫ్ మండల కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ నూతన కమిటీని నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శీతాల సత్యనారాయణ, అధ్యక్షుడు ఉసుమల రాంబాబు, ప్రధాన కార్యదర్శి దాకి జోగినాయుడు, ఉపాధ్యక్షులు కత్తు రూస్వీరాణి, కూతికి శివయ్య, కోశాధికారి ఉట ఆనంద్‌కుమార్, ఆడిట్ కన్వీనర్ శీడ శ్రీధర్ వీరితోపాటు 11 మందిని జిల్లా కౌన్సిల్, 12 మందితో కూడిన మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నవంబరులో ఏలూరు జిల్లా మహాసభలు జరిపేందుకు కమిటీ సహకరించాలని జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీధర్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర సచివాలయ నిర్మాణానికి అరెకరం పొలం విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లికి చెందిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబటి వైష్ణవి రాష్ట్ర సచివాలయ నిర్మాణానికి అర ఎకరం పొలాన్ని విరాళంగా అందించారు. సిఎం చంద్రబాబుకు ఆయన నివాసంలో ఆమె తండ్రి వైద్యులు మనోజ్‌తో కలిసి దానికి సంబంధించిన పత్రాలను అందించారు. అర ఎకరానికి సంబంధించిన రూ.12.50 లక్షలు, మరి కొంత బంగారం అమ్మి హైకోర్టు నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం అందించారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎకరం పొలం అమ్మి రూ.25 లక్షలు అమరావతి అభివృద్ధికి, వైష్ణవి తన బంగారు గాజులు అమ్మి రూ.లక్ష పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి విరాళాన్ని అందించారు. అప్పట్లో వైష్ణవిని అభినందిస్తూ అప్పటి సిఎం ఉన్న చంద్రబాబు అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. మళ్లీ తాజాగా రాష్ట్ర సచివాలయం నిర్మాణానికి, హైకోర్టు నిర్మాణానికి కలిపి రూ.13.50 లక్షలు విరాళం అందించినట్లు వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ తెలిపారు.


సిఎంకు చెక్కు అందిస్తున్న అంబటి వైష్ణవి

పాఠశాలలో సరస్వతి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం ఎంపియుపి పాఠశాలలో చదువులతల్లి సరస్వతి విగ్రహాన్ని బహూకరించిన చింతలపూడి ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. నాళం పురుషోత్తం తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బహూకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని, నేలపాటి సురేష్‌కుమార్ వారి కుమారుడు శ్రీకర్ బహూకరించిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని కూడా ప్రారంభించారు. అంతేకాకుండా నాళం సునీల్ బహూకరించిన నోట్ పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి డాక్టర్ రాంబాబు, సర్పంచి నాళం టిరీషా, హెచ్‌ఎం డి.బాజా మాట్లాడారు.

'పశుగణన'కు సహకరించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

పశుగణన కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు.

ప్రయివేటీకరణ విధానాలపై పోరు : ఎఐటియుసి

ఏలూరు అర్బన్ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై, ప్రయివేటీకరణ విధానాలపై ఎఐటియుసి నిర్వహిస్తున్న పోరాటాలు, ఆందోళనల్లో ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు క్రియాశీలకంగా పాల్గొనాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఎఐటియుసి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేట్‌పరం కాకుండా ఫ్యాక్టరీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు ఎఐటియుసి పూర్తి మద్దతు అందిస్తుందన్నారు. అక్టోబర్ 31న ఎఐటియుసి 105వ వ్యవస్థాపక దినోత్సవం జిల్లాలో ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

పట్టిసీమ గ్రూపు ఆలయాల ఇఒగా సురేష్‌నాయుడు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ గ్రూపు ఆలయాలకు ఇఒగా చాగంటి సురేష్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరంలో గునుపూడి ఆలయంలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.


సురేష్ నాయుడు

నేరాలు - ఘోరాలు

విద్యుత్ లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం సెక్షన్ పరిధిలోని ములగలంపల్లి విద్యుత్ శాఖ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సత్తిరాజు (46) వైద్యం వికటించి మృతి చెందాడని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తిరాజుకు అనారోగ్యంగా ఉండటంతో గత మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్య సిబ్బంది పరీక్షించి గుండెకు రంధ్రం ఉందని గురువారం రాత్రి శస్త్ర చికిత్స చేశారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. సత్తిరాజు స్వస్థలం కామవరపుకోటగా చెప్పారు.

ముదినేపల్లిలో బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లిలోని ముస్లింబజార్‌కు చెందిన అబ్దుల్‌సలాం టీవీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం అతని భార్య నజియా ఇంటి సమీపంలో జరిగిన డ్వాక్రా మీటింగ్‌కు వెళ్లింది. డ్వాక్రా మీటింగ్‌కు వెళ్లిన సమయంలో కుమారుడు స్కూలు నుంచి ఇంటికి వస్తాడనే ఉద్దేశంతో నజియా ఇంటికి తాళాలు వేయలేదు. మరుసటి రోజు గురువారం మధ్యాహ్నం నజియా బీరువా తెరచి నగలు కోసం చూడగా అందులో దాచి ఉంచిన బంగారు నెక్లెస్, చెవి పోగులు కనిపించలేదు. సుమారు రూ.3.50 లక్షల విలువైన నాలుగు కాసుల పావు బంగారు ఆభరణలు చోరీకి గురైనట్లు శక్రవారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నామవరంలో ఎక్సైజ్ సిఐ అశోక్ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన బోడ రామారావును పట్టుకుని అతని వద్ద నుంచి 90 లీటర్ల నాటు సారా, 119 కేజీల తెల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అటవీ భూముల సాగుదారులను ఇబ్బంది పెట్టొద్దు

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామంలో అటవీ భూములు సాగు చేసుకుంటున్న పేదలను ఇబ్బందులకు గురి చేయవద్దని, నిబంధనలకు లోబడి వ్యవహరించాలని అటవీ శాఖాధికారులకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూచించారు. ఆయన కొత్తపల్లిలో శుక్రవారం పర్యటించారు. కనకదుర్గమ్మ ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు, అధికారులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులను అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రంగాపురం సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నందిగం బాబి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిడమర్రు :సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యపడుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని చిన్ననింద్రకొలను నుంచి తోకలపల్లి గ్రామం వరకు ఉపాధి హామీ చట్టం నిధులు రూ.ఒక కోటి వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజుతో, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ మహేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - పోలవరం

స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో త్రో బాల్ క్రీడలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యురాలు సిస్టర్ టీనా కొరియా కోస్ తెలిపారు. శుక్రవారం ఫ్రాన్సిస్ స్కూల్ ఆవరణలో త్రో బాల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ విద్యార్థులను ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ టీనా కొరియా కోస్ మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో జరిగిన త్రోబాల్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో తమ స్కూల్ సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థులు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని తెలిపారు.

భీమడోలు :పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ నఫీరుద్దీన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు సభ్యునిగా హాజరు కానున్నాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరరావు తెలిపారు. ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న నఫీరుద్దీన్ కనపరిచిన ప్రతిభ ఆధారంగా జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే సభ్యునిగా ఎంపికయ్యారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నఫీరుద్దీన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఇతనికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాహుల్‌ను అభినందించారు.

స్వలాభాల కోసం పని చేయకూడదు

కామవరపుకోట :ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉండాలని, వ్యక్తిగత లాభల కోసం పని చేయకూడదని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక టివిఆర్.చినరాజప్ప ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని చెప్పారు. మండలంలోని ప్రజల నుంచి 955 అర్జీలను ఎంఎల్‌ఎ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ మురళీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు గ్రీన్ సిటీలో లయన్స్ జిల్లా 316జి లీడర్ షిప్ ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతున్న రెండు రోజుల క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ రెండు రోజుల శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయులకు ఆత్మవిశ్వాసం పెంపొందించే విషయాలు, గుడ్, బ్యాడ్ టచ్, విద్యార్థుల మానసిక వికాసం, భావోద్వేగాలు నియంత్రించే విషయాలు, ప్రభావితం కలిగించే పలు అంశాలపై లయన్స్ క్వెస్ట్ ట్రైనర్, ఫ్యాకల్టీ డాక్టర్ కె.లక్ష్మీమూర్తి శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథి, లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఛైర్మన్ వి.సురేష్ అధ్యక్షత వహించారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులోని బిసి ఏరియాలో డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రారంభించినట్లు సర్పంచి కొండేటి విజయలక్ష్మి అన్నారు. గ్రామంలోని బిసి ఏరియాలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో ఇళ్లల్లో వాడుతున్న నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమల బెడద, దుర్వాసన వెదజల్లడంతో పాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా డ్రెయినేజీ పూడికతీత పనులు మినీ పొక్లెయిన్ ద్వారా తీయిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను టిడిపి నాయకులు కొండేటి బాబి, గార్లపాటి నరసింహరావు, నక్క యోహాన్, తోట శ్రీనివాసరావు, నిమ్మగడ్డ సాంబయ్య, కంచర్ల శివప్రసాద్, కంచర్ల ప్రసాద్, హేమ, సిపిఎం నాయకులు జి.రాజు పర్యవేక్షించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్నవారికి జరిమానా

ముసునూరు :ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 12 ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఇసుక లోడింగ్ చేసినందుకు లేబర్ ఛార్జి రూ.400 కాగా వలసపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో బయట గ్రామాల వ్యక్తుల దగ్గర నుంచి రూ.500 నుంచి రూ.600 వసూలు చేస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కీమ్ వర్కర్లపై కక్ష సాధింపు చర్యలు తగవు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ

ప్రజాశక్తి - చింతలపూడి

స్కీమ్ వర్కర్లపై అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. సిఐటియు చింతలపూడి మండల జనరల్ బాడీ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద గురువారం నత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్‌వర్కర్లపై అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కుటుంబంలో ఎవరో ఒకరు ఇతర పార్టీ అభిమానులు ఉంటే దానిని ఆసరాగా తీసుకొని చిరుద్యోగులైన స్కీమ్‌వర్కర్లను ఉద్యోగాల నుంచి తప్పించి తమ సొంతవారికి ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది అధికార పార్టీకి ఆరోగ్యకరమైన పరిణామం కాదన్నారు. గడిచిన పదేళ్ల పాటు జీత భత్యం లేకుండా పనిచేస్తూ ఏ రోజుకైనా జీతం ఇవ్వకపోతారా, ఉద్యోగాలు పర్మినెంట్ కాకపోతాయా అని ఆర్థాకలితో రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేల వరకు జీతంతోనే పనిచేస్తున్నవారిని కాదని మా పార్టీ వారిని ఉద్యోగాల్లో పెట్టుకుంటామనడం న్యాయం కాదని, అధికార పార్టీ పెద్దలు విజ్ఞతతో ఆలోచించాలని చెప్పారు.

పల్లెలను ప్రగతిపథంలో నడిపేందుకు కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పల్లెలను ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నట్లు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని టి.గంగన్నగూడెం పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నుంచి సుమారు రూ.ఆరు కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, దానిలో భాగంగానే పల్లెలకు ఎక్కువ నిధులను కేటాయిస్తుందని చెప్పారు.

తాగునీటి బోరు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోపీనాథపట్నం కాలనీలో నాలుగు రోజుల క్రితం తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. దీంతో నాలుగు రోజుల నుంచి సంచార ట్యాంకు ద్వారానే కాలనీ ప్రజలకు తాగు నీటిని అందిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం వేసిన బోరు స్థానంలో కొత్తది నిర్మించాలని సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఎంఎల్‌ఎ ధర్మరాజును, ఎంపిపి గంటా శ్రీలక్ష్మిని కోరారు. ఎంపిపి మండల పరిషత్ నిధుల నుంచి రూ.మూడు లక్షలు గ్రాంటు ఇచ్చారు. శుక్రవారం పాత బోరు సమీపంలో కొత్త బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు.

పట్టభద్రులు ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోండి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు విజయవంతం చేసేందుకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఎంఎల్‌సి ఓటు హక్కు కలిగి ఉండాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. ఈ మేరకు చింతలపూడి లయన్స్ క్లబ్‌లో ఉద్యోగులు, పట్టభద్రులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. నిబంధనలు పాటించి ఎంఎల్‌సి ఓటు హక్కు పొందాలన్నారు. ఓటు దరఖాస్తులు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు, తహశీల్దార్ ప్రముద్వర, ఎంపిడిఒ మురళీకృష్ణ, బిజెపి నాయకులు విక్రమ్‌కిషోర్, గుత్త పెదబాబు, పార్టీ మండల ప్రెసిడెంట్ మాటూరి వెంకటరామయ్య, గుత్త వెంకటేశ్వరరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ముసునూరు :స్థానిక టిడిపి కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కులను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం అందించారు. మండలంలోని లైన్ తండా గ్రామానికి చెందిన బాణావతు తులసీరామ్ రూ.15,688, బాణావతు లక్ష్మి రూ.25 వేల చెక్కును అందించారు.

బుక్ కీపర్లను తొలగించడం సరికాదు

ప్రజాశక్తి - ముసునూరు

పార్టీతో సంబంధాలు లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న బుక్ కీపర్లను తొలగించరాదని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు అనుబంధం బుక్ కీపర్ల జిల్లా సెక్రటరీ సుభాషిణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ఎపిఎం కోమటి రాంబాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుంచి ఉద్యోగ నిర్వహణలో ఉన్న వారిని అక్రమంగా రాజకీయ నాయకులు తొలగించడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు, మండల నాయకులు కొడవలి శ్రీను, గోపవరం, కాట్రేనిపాడు గ్రామాల డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

29న కైకరంలో జిల్లాస్థాయి రైతు సదస్సు

కరపత్రాలు విడుదల చేసిన రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 29న కైకరంలో ధాన్యం మద్దతు ధర - కొనుగోలు సమస్యలపై జిల్లాస్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. రైతు సదస్సు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర కోసం జరుగుతున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సు 29న మధ్యాహ్నం ఒంటి గంటకు తూర్పు వీధి రామాలయం ఎల్ఐసి వేదిక వద్ద నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల నుండి వరి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం మద్దతు ధర-కొనుగోలు సమస్యలపై సదస్సులో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. జిల్లా స్థాయి రైతు సదస్సు విజయవంతం కోరుతూ అన్ని గ్రామాల్లో కరపత్రాలు ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కో-కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల సబ్ డివిజన్ పరిధిలో జరిగిన నేరాల వివరాలను ఆయా ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణను తగ్గించే విధంగా సిబ్బంది కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, పోలవరం సిఐ బాల సురేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు అర్బన్ :మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ సునీత ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎపిజెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ల కమిటీల ఎన్నిక జరిగింది. రాష్ట్ర చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే మహిళా ఉద్యోగుల సమస్యలను ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరి, గీతిక, శాంతకుమారి, యామిని పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
నూజివీడు బ్రాంచ్, #17-248, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ రోడ్డు, నూజివీడు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521201.

డిమాండ్ కమ్ పునః స్వాధీనత - జప్తు నోటీసు

దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) అంగీకరించిన నియమాల ప్రకారం ఋణ సదుపాయం యొక్క అసలు వడ్డీని తిరిగి చెల్లించుటలో విఫలమైనారని మరియు పై సదరు ఋణ సదుపాయాలకు సంబంధించి ఖాతాల యొక్క ఆపరేషన్ నిర్వహణ క్రమరాహిత్యంగా ఉందని ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఋణగ్రహీత/లు డిఫాల్ట్‌కు పాల్పడినందున, గ్యారంటర్లు వారిచే అమలు చేయబడిన లెటర్ ఆఫ్ గ్యారంటీ ప్రకారం బ్యాంక్‌కు బకాయి మొత్తాన్ని చెల్లించవలసి ఉంది. తదనుగుణంగా, **తేది:19-10-2024** తేదీ గల డిమాండ్ నోటీసు/లు చివరిగా తెలిపిన వారి చిరునామాలకు జారీ చేయబడినవి. కానీ సదరు నోటీసులు అందకుండా తిరిగి వచ్చినవి మరియు అందువలన బహిరంగ ప్రకటన ద్వారా వారికి తెలియజేయబడుతుంది. **(లోన్ ఖాతా నెం. 45160600016397)**

ఋణగ్రహీతల పేర్లు & చిరునామా	తాకట్టు పెట్టిన చరాస్తి వివరాలు	బకాయి మొత్తం (నోటీసు తేది నాటికి)
ఋణగ్రహీత: శ్రీ కర్రి సత్యనారాయణ, తండ్రి : లేటు కర్రి అప్పారావు, 12-154, గాంధీ నగర్, నూజివీడు, ఏలూరు జిల్లా - 521201, ఆంధ్రప్రదేశ్.	BAJAJ AUTO LTD / BAJAJ MAXIMA CNG - AUTO RICKSHAW వెహికల్ మోడల్ : 2023 వెహికల్: రిజిస్ట్రేషన్ నెం. AP 39 UN 5470 నోటీసు తేది: 19.10.2024	తేది.19.10.2024 నాటికి రూ.2,24,871.52 పై (అక్షరాల రెండు లక్షల ఇరవై నాలుగు వేల ఎనిమిది వందల డెబ్బై ఒక్క రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) దానిపై వ్యయాలు, ఛార్జీలతో పాటు అంగీకరించిన రేట్ల వంతున తేది: 20.10.2024 నుండి వర్తింపుతో దానిపై తదుపరి వర్తించని వడ్డీ

చెల్లింపు లేదా రాబట్టుకొనే వరకు వ్యయయాలు, ఛార్జీలు, ఇతర మనీలతో పాటు అంగీకరించిన రేట్ల వంతున **తేది.20.10.2024** నుండి వర్తింపుతో దానిపై తదుపరి వడ్డీతో పైన తెలిపిన మొత్తాన్ని పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులు బకాయి పడినారు. మరియు మీ అందరిచే అది చెల్లించబడాలి. అందువలన బ్యాంక్ ఆఫ్ బరోడా అయిన మేము ఈ నోటీసు తేదీ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించవలసిందిగా మీ అందరినీ సంయుక్తగా మరియు విడివిడిగా కోరుతున్నాము. చెల్లించుటలో మీరు విఫలమైతే, ఋణం/తాకట్టు అగ్రిమెంట్/లులో లభించే అధికారాల ప్రకారం సహాయం తీసుకొనేందుకు మరియు ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా తాకట్టు పెట్టిన చరాస్తిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు (జప్తు చేయుటకు మరియు వాటిని విక్రయించి మీరు బకాయి పడిన మొత్తం నిమిత్తం అమ్మకం రాబడులను సర్దుబాటు చేసేందుకు మాకు తప్పనిసరి అవుతుంది. అమ్మకం రాబడులు సర్దుబాటు చేసిన తర్వాత ఏదైనా మొత్తం తగ్గితే, మేము సమర్థ న్యాయస్థానంలో మీ అందరిపై సివిల్, క్రిమినల్ మరియు ఇతర మిసిలేనియస్ ప్రొసీడింగ్స్ తీసుకుంటాము మరియు అట్టి సందర్భంలో మీరు అన్ని వ్యయాలు, నష్టాలు మరియు పరిణామాలకు పూర్తిగా బాధ్యులు అవుతారు.

తేది: 25-10-2024, ప్రదేశం: నూజివీడు
సం/- బ్రాంచి మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా

11 జిల్లాల్లో 8,077 విద్యుత్ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 11 జిల్లాల పరిధిలో 8,077 విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించినట్లు ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార విశాఖపట్నం న్యాయస్థానం ఛైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చేబ్రోలు సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయమూర్తి ఛైర్మన్ బి.సత్యనారాయణ, న్యాయస్థానం సభ్యులు ఎస్.మశిలమణి, సభ్యులు ఎస్‌కె.బాబర్ విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో న్యాయస్థానం ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

ముగిసిన రీ సర్వే గ్రామసభలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో రీ సర్వేకు సంబంధించి జరుగుతున్న గ్రామ సభలు ముగిశాయి. శుక్రవారం మండలంలోని వాడవల్లి, ఊటుకూరు, కాకరవాడ గ్రామాల్లో తహశీల్దార్ ఆధ్వర్యంలో రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. మూడు గ్రామాల్లో జరిగిన సభల్లో రైతులు వద్ద నుంచి 79 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ సుభాని తెలిపారు. రానున్న 15 రోజుల్లో కూడా రైతులు రీసర్వేకు సంబంధించిన అర్జీలను తమకు సమర్పించవచ్చన్నారు.

CHANGE OF NAME

I, GUDURI RAMA KRISHNA RAO S/o. Guduri Muneswara Rao, D.No. 2-200, Mallavaram, Pedalanka, Mallavaram Post, Narasapur Mandal, W.G.Dt. A.P. I have changed my name from GODURI RAMA KRISHNA RAO (Old name) to GUDURI RAMA KRISHNA RAO (New name) hence after all my documents and correspondence will be countinue with my New name GUDURI RAMA KRISHNA RAO

CHANGE OF NAME

I, GUDURI NAGAMANI W/o. Guduri Rama Krishna Rao, D.No. 2-200, Mallavaram, Pedalanka, Mallavaram Post, Narasapur Mandal, W.G.Dt. A.P. I have changed my name from GODURI NAGAMANI (Old name) to GUDURI NAGAMANI (New name) hence after all my documents and correspondence will be countinue with my New name GUDURI NAGAMANI

CHANGE OF NAME

I, TARAPATLA REETHU SABITHA ANGEL D/o. Tarapatla Bhimanna, D.No. 2-1-17, Ward 2, Madhavaya Palem, Narasapuram-534275, W.G.Dt. A.P. I have changed my name from TARAPATLA REETHU SABITHA ANGLE (Old name) to TARAPATLA REETHU SABITHA ANGEL (New name) hence after all my documents and correspondence will be countinue with my New name TARAPATLA REETHU SABITHA ANGEL

పాస్‌పోర్టు పోయినది

నరసాపురం పట్టణము చెందిన బంగారు వినాయక కృష్ణ అనిష్, నా ఆధార్ నెంబర్ 318742630616, తండ్రి: బంగారు శ్రీనాథ్, డోర్ నెంబర్ 7-5-33, వై.ఎన్ కాలేజ్ రోడ్, నరసాపురం, ప.గో.జిల్లా, ఏపీ. తెలియజేయునది ఏమనగా నేను 22-07-2007న వైజాగ్‌లో తీసుకున్న పాస్‌పోర్టు నెం. G1194918 గల పాస్‌పోర్టు పోయినది. నేను ఇటీవల మా ఇంటి నుండి మెయిన్ బజార్ జిరాక్స్ తీసుకోడానికి వెళ్లుతుండగా మార్గ మధ్యలో పాస్‌పోర్టు మిస్ అయినది. ఎంత వెతికినను ఎక్కడా దొరకలేదు. ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్: 99498 61899

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT. AT: HYDERABAD.
O.S.NO. 464 of 2019

Between:
M/s. Aurobindo Pharma Ltd., ...PLAINTIFF
AND
M.Sindhu Priya & others ...DEFENDANTS

To
1. M.Sindhu Priya, D/o.M.Raju, 12-134, Behind Police Station, Pentapadu, W.G.Dist., A.P.-534166.
2. B.Sukanya, D/o.Satyanarayana, 11-158, Harijanapeta, Gundugolanu, Bheemadulu (M), W.G.Dist., A.P.-534427.
3. V.Kishore, S/o. Venkat Rao 12-133, S.C.Colony, Tadepalligudem, W.G.Dist., A.P.-534101.
... Defendant Nos. 1 to 3.

WHEREAS the Plaintiff Company filed the above Suit against you for recovery of damages, the above suit is posted to 08-11-2024 for your appearance, you are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at 10.30.A.M., on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined exparte.

// BY ORDER OF THE COURT//
K. VENUGOPAL REDDY,
K. NARASIMHA REDDY,
Advocates,
4-92/2/A, Ist Floor, Opp: Mee Seva & GHMC., Chandanagar, Hyd-500050.